కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్

● సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సామ రమణారెడ్డి

చంపాపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సామ రమణారెడ్డి బుధవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆధ్వర్యంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో రెండు వందల మంది అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం సామ రమణారెడ్డి తమ అనుచరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. రమణారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోనున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు, నాయకులు మెట్టు వెంకట్‌రెడ్డి, ఖాదర్, ఆకుల రమాకాంత్‌గుప్తా, బెక్కెం లక్ష్మీనారాయణ, గంగబాబు, వెంకటేష్, అన్నుకుమార్, ఐలేష్‌యాదవ్, నాగరాజు, చిరంజీవి, ప్రభాకర్, సుదర్శన్, మల్లేష్, సాయికుమార్, బండారు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణగౌడ్, కృష్ణయాదవ్, నరేందర్, జమీల్, గుర్రం మోహన్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, శాలిని, యాదగిరి, రవీందర్‌గౌడ్, రఘునందన్‌రెడ్డి, తోకటి కిరణ్, బండి సురేందర్, కారుకొండ శివ, రాము, గోపాల్ ముదిరాజ్, అనసూయ, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



మధుయాష్కీగౌడ్, రఘుమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నేతలు నిషికాంత్‌రెడ్డి, గౌతంరెడ్డి తదితరులు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రమణారెడ్డి

మధుయాష్కీగౌడ్ సమక్షంలో..

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ చైర్మన్, కాంగ్రెస్ నేత నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సమక్షంలో ఆలయ ధర్మకర్తలు, పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఆలయ ధర్మకర్తలు బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, చీర తిరుమలేష్, బీఆర్ఎస్ నేతలు నిషికాంత్‌రెడ్డి, గూడూరు గౌతంరెడ్డి ఉన్నారు. పార్టీ నేతలు ఆనంద్‌కుమార్‌గౌడ్, మల్కాజిగిరి దయానంద్, సామ రంగారెడ్డి, ప్రేమ్‌నాథ్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఒపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్ కొండపల్లి టాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈసందర్భంగా నిర్వాహకుడు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తమకు సహకరించాలని విన్నవిస్తున్న చిరువ్యాపారులు

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పండ్ల విక్రయాలు జరుపుకోవాలి: ఎమ్మెల్యే

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పండ్ల క్రయ, విక్రయాలు జరుపుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. సర్వీసు రోడ్డులో పండ్ల విక్రయాలు జరపకుండా ట్రాఫిక్ పోలీసులు అడ్డుకుంటున్నారని, తమ విక్రయాలు సాఫీగా జరిగేలా సహకరించాలని కోరుతూ చైతన్యపురి పెట్రోల్ బంక్ నుంచి కొత్తపేట బీఎస్ఎన్‌ఎల్ కార్యాలయం వరకు సర్వీసు రోడ్డుపై పండ్ల విక్రయాలు జరుపుకునే చిరువ్యాపారులు బుధవారం ఎమ్మెల్యేకు విన్నవించారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులపై పోలీసులకు ఎలాంటి ద్వేషం ఉండదని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండడం మూలంగానే చర్యలు చేపడుతున్నారని వివరించారు. అధికారులతో చర్చించి, సమస్యకు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

పండ్ల వ్యాపారం ముక్కలైంది: రాంరెడ్డి

దిల్‌సుఖ్‌నగర్ : బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా పండ్ల మార్కెట్ ముక్కలైందని కాంగ్రెస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సర్వీసు రోడ్డులో పండ్ల విక్రయాలు జరపకుండా ట్రాఫిక్ పోలీసులు అడ్డుకుంటున్నారని, తమ విక్రయాలు సాఫీగా జరిగేలా సహకరించాలని కోరుతూ పండ్ల వ్యాపారులు బుధవారం ఆయనను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా విక్రయాలు జరుపుకోవాలని సూచించారు.



మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని జ్ఞాపికతో సత్కరిస్తున్న చైర్మన్ రమేష్‌గుప్తా

ఆలయాల అభివృద్ధికి కృషి: తీగల

ఎల్‌బీనగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఆర్‌కేపురంలోని ఆంజనేయస్వామి, ఖిల్లా మైసమ్మ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. ఆర్‌కేపురంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ ఉత్సవాల్లో తీగల కృష్ణారెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్, చామల శైలజరెడ్డి, భూపాల్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, పగడాల ఎల్లన్న, ఆలయ చైర్మన్ జగిని రమేష్‌గుప్తా, యాదవరెడ్డి పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులను కాపాడుకోవాలి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సమాజంలోని రంగస్థల కళాకారులను ప్రోత్సహించి వారిని కాపాడుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనస్థలిపు రం భక్త సమాజం ఆధ్వర్యంలో రాష్ట్ర చలనచిత్ర రంగస్థల అభివృద్ధి సంస్థ సహకారం తో రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య సౌజన్యంతో ఎన్జీవోస్‌కాలనీలోని చంద్రకళా వేదికపై ఈనెల 29న సాయంత్రం 6గంటలకు ప్రదర్శించే 'రేపింది' సాంఘిక నాటక కరపత్రాన్ని కార్పొరేటర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాకారులు అంతరించి పోతున్న నేటి కాలంలో రంగస్థల కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీ.హెచ్.వీ. ఆర్.కే మూర్తి, జైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



రంగస్థల నాటక ప్రదర్శన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి



సంతోష్‌నగర్‌లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

సంతోష్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సంతోష్‌నగర్ పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్‌గౌస్ సూచించారు. శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం స్టేషన్ పరిధిలోని బన్నాక, అన్మోల్‌చౌరస్తా, కుమ్మరివాడి, యూనిక్ స్కూల్, జమాల్‌కాలనీ, రక్షాపురం, అరుంధతికాలనీ, గుల్షన్ ఇక్బాల్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పోలీసులు దారి పొడవునా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యూపీవీసీ పైపులపై నకిలీ బీఐఎస్ మార్క్

● బీఐఎస్ అధికారుల దాడులు, పైపులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నకిలీ బీఐఎస్ మార్కు లేబుల్‌తో పీవీసీ పైపులను విక్రయిస్తున్న సంస్థపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు దాడులు నిర్వహించి, నకిలీ పైపులను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద అంబర్‌పేటలోని శ్రీసాయి గణేష్ రాక్ టూల్స్ సంస్థ నిర్వాహకులు తాము తయారీ చేస్తున్న అన్‌ప్లాస్టిసైజ్డ్ పాలివినైల్ క్లోరైడ్(యూపీవీసీ) పైపులపై ఎలాంటి అనుమతులు లేకుండా బీఐఎస్, మార్కును వినియోగిస్తున్నారు. వీరి వ్యవహారంపై పక్కా సమాచారమందుకున్న బీఐఎస్ అధికారులు దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి వివిధ సైజుల 130 మీటర్ల పైపులను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా బీఐఎస్ మార్కు వినియోగించడం నేరమని, ఇలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని బీఐఎస్ అధికారులు హెచ్చరించారు.



శ్రీసాయి గణేష్ రాక్‌టూల్స్ సంస్థలో తనిఖీలు నిర్వహిస్తున్న బీఐఎస్ అధికారులు



హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, ఈఓ శ్రీనివాసశర్మ

హనుమాన్ ఆలయ హుండీల లెక్కింపు

చంపాపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో బుధవారం ధ్యానాంజనేయస్వామి తో పాటు పలు ఉప ఆలయాలలోని హుండీలను లెక్కించారు. రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌ప్రభు సమక్షంలో నిర్వహించిన లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఆలయ ఈఓ ఎం. శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఈ హుండీ లెక్కింపులో స్వామి వారికి రూ.20,60,652 ఆదాయం వచ్చినట్లు, ఇందు లో 410అమెరికా డాలర్లు, 10యూకే పౌండ్స్ వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాసయాదవ్, మధుసాగర్, చీర తిరుమలేష్, యాదగిరి, బిల్లకంటి కిరణ్‌కుమార్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

జీఎస్ఐలో రూల్ రిజర్వేషన్ పాటించాలి

● నేషనల్ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

వనస్థలిపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో రూల్ రిజర్వేషన్ తప్పకుండా పాటించాలని నేషనల్ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. రిజర్వేషన్స్ ఫర్ షెడ్యూలు కాస్ట్, జనరల్ లెక్చర్ ఫర్ ఎస్సీ, ఎస్టీలపై ఉపన్యాస కార్యక్రమాన్ని బుధవారం నాగోల్‌లోని జీఎస్ఐ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంచందర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను జీఎస్ఐలో తప్పకుండా పాటించాలని, ఎప్పటికప్పుడు ఎస్సీ, ఎస్టీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పదవి విరమణ చేసిన ఏడీజీ, హెచ్‌ఓడీ సీహెచ్.వెంకటేశ్వర్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అఖిలభారత జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజనల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ, ఎల్‌పీ సింగ్, మహాపాత్ర, సునీల్‌కుమార్, బాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేషనల్ కమిషన్ సభ్యుడు రాంచందర్



పాఠశాలకు కంప్యూటర్లు, ఇతర వస్తువులను అందజేస్తున్న ఇంద్రజ

అంధుల పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

చాదర్‌ఘాట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల దారుషిఫాకు బుధవారం వేయిత్ టర్ఫ్ ప్రైవేటు లిమిటెడ్ ఏజీఎం వెంకటరమణ, కార్యదర్శి ఇంద్రజల చేతుల మీదుగా 10కంప్యూటర్లు, స్కానర్, ప్రింటర్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఇంద్రజ మాట్లాడుతూ అంధ విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఖుదిషియా, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, సద్గుణ, సునంద పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో సంతాప సభ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం సంతాపసభ నిర్వహించారు. జడ్జి మణికంఠ, న్యాయవాదులు మదన్‌మోహన్, పరకాల సంజీవ్‌గౌడ్‌ల మృతికి సంతాప సూచకంగా మౌనం పాటించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు అనంత సేనారెడ్డి, భార్గవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ధీకొండ రవీందర్, కార్యదర్శి మాధవరెడ్డిలతో పాటు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. జిల్లా కోర్టులో ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 4.30 గంటల వరకు జరగనున్నది. బార్ అసోసియేషన్ ఓటరు జాబితాలో పేరు ఉన్న వారందరు ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగపర్చుకోవాలని ఎన్నికల అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్ సూచించారు.

ఇంకుడు గుంతలపై మహిళలకు అవగాహన కల్పించాలి

● హయత్‌నగర్ సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం

వనస్థలిపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వాన నీటి సంరక్షణ కోసం ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని హయత్‌నగర్ సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ జైపూరి కాలనీలో టౌన్ లెవల్ మహిళా సంఘాల సభ్యులకు సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, వినియోగం పై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బలరాం, వాటర్‌వర్క్స్ మేనేజర్ అర్చన మాట్లాడుతూ నీటి సంరక్షణకు ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టేట్లు మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షపు నీటిని ఇంకుడుగుంతల ద్వార సంరక్షణపై తగు ప్రోత్సాహం అందించాలని సూచించారు. భవిష్యత్‌లో నీటి కొరత రాకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో సీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నాగబ్రహ్మాచారి, జలమండలి అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



ప్రపంచ నీటి దినోత్సవంలో మహిళా సంఘాల ప్రతినిధులు

కోదండ రామచంద్రస్వామి లగ్నపత్రిక విడుదల

● ఏప్రిల్ 13 నుంచి 19 వరకు కల్యాణం, రథోత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కవాడిపల్లిలోని చారిత్రాత్మక కోదండ రామచంద్రస్వామి కల్యాణ, రథోత్సవాల లగ్న పత్రికను బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు ధివి పవన్‌కుమార్ ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో సీతారాముల కల్యాణ లగ్న పత్రికను విడుదల చేశారు. బుధవారం నుంచే స్వామి వారి కల్యాణ, రథోత్సవాల కార్యక్రమాలు ప్రారంభించినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఏప్రిల్ 13 నుంచి 19 వరకు కల్యాణ ఉత్సవాలు ఉంటాయని 17న కోదండ రామచంద్ర స్వామి కల్యాణం, 18న రథోత్సవం, 19న చక్రతీర్థం తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కందాడి మోహన్‌రెడ్డి, కందాడి సంజీవరెడ్డి, కొలన్ శ్రీధర్‌రెడ్డి, దూసరి యాదయ్యగౌడ్, ఇరుగు చిత్తారి, బొడిగె రమేష్‌గౌడ్, ఎడ్ల కృష్ణారెడ్డి, కొలన్ కొండల్‌రెడ్డి, రాసాల రాముయాదవ్, సుర్వి భాస్కర్‌గౌడ్, బొడిగె కొండల్‌గౌడ్, ఎర్రకోల్ రవియాదవ్, నర్సింహయాదవ్, బుచ్చయ్యయాదవ్, బొడిగె సురేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, బాబు పాల్గొన్నారు.



కోదండ రామచంద్రస్వామి కల్యాణ లగ్న పత్రికను ఉత్సవ కమిటీ ప్రతినిధులకు అందజేస్తున్న అర్చకుడు పవన్‌కుమార్



భరత్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా భరత్

చాదర్‌ఘాట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా మూసారాంబాగ్ నివాసి అనుముల భరత్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి భరత్‌ను అభినందించారు. ఈసందర్భంగా భరత్ మాట్లాడుతూ హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో అసెంబ్లీ నియోజకవర్గాలు, డివిజన్ల వారిగా బీజేవైఎం కమిటీలను మరింత పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, మాజీ అధ్యక్షుడు యాదగిరి సురేందర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీఎస్ ఎప్‌సెట్‌కు ఏపీలో పరీక్షా కేంద్రాల పెంపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షా కేంద్రాలను పెంచినట్లు అధికారులు తెలిపారు. టీఎస్ ఎప్‌సెట్‌కు ఈ ఏడాది ఏపీలో పరీక్షా కేంద్రాలను భారీగా తగ్గించడంపై 'ఎప్‌సెట్‌కు ఏపీలో తగ్గిన పరీక్షాకేంద్రాలు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి టీఎస్ ఎప్‌సెట్ ఉన్నతాధికారులు స్పందించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎప్‌సెట్‌కు ఏపీలో తగినన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని, ఏపీ అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సెట్ నిర్వహణ బాధ్యత చేపట్టిన జేఎన్‌టీయూ అధికారులను ఆదేశించారు. ఏపీలోని విశాఖపట్నం జోన్ పరిధిలో విజయనగరం, విజయవాడ జోన్ పరిధిలో మచిలీపట్నం, గుడ్లవల్లేరు, గుంటూరు జోన్ పరిధిలో నర్సరావుపేట, తిరుపతి జోన్ పరిధిలో మదనపల్లి, కర్నూలు జోన్ పరిధిలో నంద్యాల, అనంతపురం పట్టణాల్లో అదనంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఏపీ అభ్యర్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు అవసరమైతే మరో 10 వేలమంది అభ్యర్థులకు సరిపడేలా మరికొన్ని పరీక్షాకేంద్రాలను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని టీసీఎస్ సిబ్బందికి జేఎన్‌టీయూ అధికారులు సూచించారు. కొత్త పరీక్షాకేంద్రాల ఏర్పాటుతో సుమారు 8,500 మంది అభ్యర్థులు వారి నివాస ప్రాంతాలకు సమీపంలో పరీక్షా కేంద్రాలను ఎంచుకునేందుకు వీలు ఏర్పడింది. పరీక్షా కేంద్రాలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అక్కడి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలి

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి

తార్నాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) అర్హత పరీక్ష ఫీజును తగ్గించాలని కోరుతూ బుధవారం తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లెపల్లి స్వామిగౌడ్ మాట్లాడుతూ గతంలో టెట్ అర్హత పరీక్ష ఫీజు ఒక పేపర్‌కు రూ.200 ఉండగా, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి రూ.1000కి పెంచిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల బడుగు బలహీనవర్గలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి టెట్ అర్హత పరీక్షా ఫీజును తగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు సురేష్, రాజేందర్, బద్రి, రాజశేఖర్, మహష్, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రాన్ని అందజేస్తున్న విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్ తదితరులు

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ క్వార్టర్స్‌లో నివసిస్తున్న ఉమావతి(28) వివాహం అయిన తర్వాత విడాకులు తీసుకుంది. తల్లిదండ్రులు చనిపోవడంతో ఇద్దరు చెల్లెళ్లతో కలిసి నివసిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం బుద్వేల్-ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.